బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 22 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## ఢిల్లీలో పడిపోయిన గాలి నాణ్యత..!

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



దేశ రాజధాని నగరం ఢిల్లీలో గాలి నాణ్యత దారుణంగా పడిపోతున్నది. సోమవారం ఉదయానికి ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 349కి పడిపోయింది. దాంతో కాలుష్య నియంత్రణ మండలి ఈ పరిస్థితిని 'వెరీ పూర్' కేటగిరిగా వర్గీకరించింది. వాయు కాలుష్యం కారణంగా నగరంపై దట్టంగా పొగ మంచు కమ్మి ఉంటోంది. దాంతో ఉదయం పూట వాహనదారులు రోడ్లపై విజిబిలిటీ సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గాలి నాణ్యతలు క్షీణించడంతో ఢిల్లీ వాసులు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధ సమస్యలు తీవ్రంగా పెరిగాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఢిల్లీ ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే బాణాసంచా వినియోగం, తయారీపై ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ప్రతి ఏడాది శీతాకాలంలో చల్లదనం కారణంగా ఢిల్లీలో గాలి నాణ్యత దెబ్బతింటున్నా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం లభించడంలేదు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే

# కఠిన చర్యలు



- అమరులైన పోలీసులకు అండగా ఉంటాం
- వారికి నష్ట పరిహారం పెంపు..
- బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం..
- సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ టాప్
- డ్రగ్స్, గంజాయిపై టీజీ న్యాబ్ ఉక్కుపాదం..
- పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం గోషామహల్ పోలీస్ స్టేడియంలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ ఫ్లాగ్ డే కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా విచ్చేసి పోలీసు అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అమర పోలీసు కుటుంబాలతో ప్రత్యేకంగా మాట్లాడారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తూ ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలనిపోలీసులకు చెప్పారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన ఘటనను ఉటంకిస్తూ, ప్రజల్లో విభేదాలు సృష్టించాలన్న సంఘ వ్యతిరేక శక్తుల చర్యలను నియంత్రించడంలో ప్రభుత్వం పోలీసులకు సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. ఏ రాష్ట్రమైనా ప్రగతి పథంవైపు నడవాలంటే శాంతి భద్రతలు పరిరక్షణ అత్యంత కీలకమని చెప్పారు. శాంతి భద్రతలను కాపాడటంలో నిరంతరం శ్రమిస్తున్నందుకు తెలంగాణ పోలీసు సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు. తప్పు చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి. అలాగే ఎవరో తప్పు చేశారని, వాళ్లను తామే శిక్షిస్తామని కొందరు శాంతి భద్రతలను చేతుల్లోకి తీసుకుంటున్నారు. అలాంటి సందర్భాల్లో తప్పు చేసిన వారికి, చట్టాలను చేతుల్లోకి తీసుకుంటున్న వారికి మధ్య తేడా లేకుండా పోతుంది. తప్పు చేసే వారెవరైనా పోలీసులు కఠినంగా వ్యవహరించాలి.శాంతి భద్రతలు, మత సామరస్యం కాపాడబడినప్పుడే మన పండుగలను గొప్పగా నిర్వహించుకోగలం.కొన్ని సందర్భాల్లో ఎలాంటి వసతి సౌకర్యాలు లేనప్పటికీ పోలీసులు హైదరాబాద్ నగరంలో మతసామరస్యాన్ని కాపాడటంలో ఎంతో శ్రమిస్తున్నారు.

### అమరులైన పోలీసుల కుటుంబాలకు నష్ట పరిహారం పెంపు

విధుల్లో ఉండి అమరులైన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వారి కుటుంబానికి నష్ట పరిహారాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.విధి నిర్వ హణలో మరణిస్తే కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లకు రూ. కోటి, సబ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్లకు రూ. 1.25 కోట్లు, డీఎస్పీ, అదనపు ఎస్పీలకు రూ.1.50 కోట్లు, ఎస్పీ, ఐపీఎ స్లకు రూ. 2 కోట్ల పరిహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అంగవైకల్యం, తీవ్రగా యాలైన వారి విషయంలోనూ ఇచ్చే పరిహారాన్ని పెంచినట్లు తెలిపారు. పోలీసు కుటుంబాల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

### సైబర్ క్రైం నియంత్రణలో తెలంగాణ టాప్..

సైబర్ క్రైం నియంత్రణలో తెలంగాణ ముందుందన్నారు. సెక్యూరిటీ బ్యూరో అధికారులు దేశంలోనే నంబర్ 1గా గుర్తింపును తెచ్చుకున్నారని అభి నందించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలను టీజీ న్యాబ్ విభాగం ఉక్కుపాదంతో అణిచివేస్తోందన్నారు. తెలంగాణ పోలీసుల పని తీరు ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఇవాళ ఖద్దర్, ఖాకీల విధులను సమాజం ఎప్పుడు నిశితంగా గమనిస్తుందని, అందుకే ఆదర్శంగా ఉండేలా పని చేద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పోలీసులకు ఎప్పుడు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రజలతోనే క్రిమినల్స్ తో కాదన్నారు. క్రిమినల్స్ విషయలో కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పోలీసులు సహనం, ఓపికతో విధులు నిర్వహించాలని సూచించారు.

బాధితుల విషయంలో మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలే తప్ప క్రిమినల్స్ విషయంలో కఠినంగా వ్యవహరించాలి.పోలీసు కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారి వరకు విధి నిర్వహణలో ప్రమాదాలకు లోనైనప్పుడు, అమరులైనా లేదా అంగవైకల్యం చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం పెంచుతున్నాం. పోలీసు శాఖ, సిబ్బంది పట్ల ప్రత్యేకమైన అభిమానం ఉంది. పోలీసులు ఆత్మగౌరవంతో బ్రతకాలి. మరొకరు చులకనగా మాట్లాడే అవకాశం ఇవ్వొద్దు. సమాజంలో అందరికీ రక్షణ కల్పించే పోలీసుల గురించి గొప్పగా మాట్లాడుకోవాలి అన్నారు. కొత్త కొత్త రూపాల్లో జరుగుతున్న నేరాలను అరికట్టడంలో గతంలో ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ తరహాలో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసుకోవాలి. హోంగార్డు నుంచి డీజీపీ వరకు పోలీసు కుటుంబాల పిల్లలకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతోనే నేషనల్ డిఫెన్స్ అకాడమీ, సైనిక్ స్కూల్ తరహాలో యంగ్ ఇండియా పోలీస్ స్కూలును ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఎలాంటి లోటురాకుండా పోలీసు కుటుంబాల పిల్లల భవిష్యత్తుకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలబడుతుందన్నారు.

### సికింద్రాబాద్ దేవాలయ ఘటనలో నిందితులను శిక్షిస్తాం..

సికింద్రాబాద్ ముత్యాలమ్మ దేవాలయం ఘటనలో నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. కొందరు ఉద్రిక్త పరిస్థితులను నెలకొ ల్పేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది మంచిది కాదన్నారు. ఘటనపై ఉద్రిక్తత పెంచడం సరికాదన్నారు. ఈ కేసులో పోలీసుల దర్యాప్తుపై ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని, దోషులకు శిక్ష కచ్చితంగా పడుతుందని పేర్కొన్నారు. అలాంటి వారిని సహించేది

మిగితా 3వ పేజీలో

## 4న కేంద్ర హోంశాఖ కీలక భేటీ..

- ఏపీ, తెలంగాణ అపరిష్కృత అంశాలపై చర్చ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విభజన జరిగి పదేళ్లయినప్పటికీ, ఇంకా అనేక అంశాలు ఓ కొలిక్కి రావాల్సి ఉంది. ఈ అపరిష్కృత అంశాలపై కేంద్ర హోంశాఖ చొరవ తీసుకుని సమావేశాలు ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 24న కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో కీలక సమావేశం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ భేటీలో ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొననున్నారు. ఇరు రాష్ట్రాలకు చెందిన వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొనే ఈ సమావేశానికి హాజరుకావాలని తెలంగాణ సీఎస్‌కు కేంద్ర హోంశాఖ సమాచారమిచ్చింది. ఈ సమావేశంలో పలు కేంద్ర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు.. విద్యుత్, రహదారులు, ఉక్కు, వ్యవసాయం తదితర శాఖల కార్యదర్శులు కూడా పాల్గొంటారు. ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలను కలిసి విభజన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ క్రమంలోనే కేంద్ర హోంశాఖ తాజాగా సమావేశం ఏర్పాటు చేసింది.



## ప్రపంచానికి ఆశాదీపంగా భారత్

- ప్రధాని మోడీ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రపంచానికి భారత్ ఆశాదీపంగా పనిచేస్తోందని ప్రధాని మోడీ అన్నారు. వివిధ రకాల సమస్యలతో సతమతం అవుతున్న ప్రపంచానికి భారత్ ఆశను కల్పిస్తోందని అన్నారు. ఢిల్లీలో ఎన్డీటీవీ నిర్వహి స్తున్న సదస్సులో ఆయన మాట్లాడారు. భారత సర్కారు అసాధారణ రీతిలో పనిచేస్తోందని, ప్రతి రంగంలోనూ వేగం పెంచినట్లు ఆయన చెప్పారు. మూడవ సారి తాము అధికారంలోకి రావడం వల్ల భారత వృద్ధి రేటు వేగంగా జరుగుతున్నట్లు అనేక సంస్థలు అంచనా వేశాయన్నారు. ప్రపంచం మొత్తం కొవిడ్, యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో ఇబ్బంది పడుతున్న వేళ కూడా మన దేశంలో 'భారత్ శతాబ్ది' గురించి ఆలోచిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. దేశం ప్రతి రంగలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అభివర్ణించారు.

డబుల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో భారత్‌కు అడ్వాంటేజ్ జరుగుతోందని, ఏఐ టెక్నాలజీతో పాటు ఆస్పిరేషనల్ ఇండియాగా దేశం మారుతోందన్నారు. దేశ ప్రజలు వికసిత్ భారత్ గురించి చర్చిస్తున్నట్లు ఆయన తెలిపారు. జన శక్తితో రాష్ట్ర శక్తి సాధిస్తున్నట్లు ఉందన్నారు. ఊహాజనితంగా సంబంధాలను పెంచుకోబోమని, తమ బంధాలన్నీ నమ్మకం, విశ్వాసం మీద ఆధారపడి ఉంటాయని ప్రధాని మోదీ తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, డిజిటల్ ఇన్నోవేషన్.. సహజీవనం చేయగలవని భారత్ నిరూపించినట్లు ప్రధాని చెప్పారు. టెక్నాలజీతో సమగ్రత సాధించాలని, కానీ దాన్ని నియంత్రణకు, విభజనకు వాడరాదన్న ఉద్దేశాన్ని భారత్ చూపించినట్లు ప్రధాని తెలిపారు. తమ ప్రభుత్వానికి రెస్ట్ అనేది లేదని, భారత దేశ కలలను నిజం చేసే వరకు విశ్రమించబోమన్నారు.

"మా ప్రభుత్వం ఇప్పటికే 125 రోజులు పూర్తి చేసుకొంది. ఈ కాలంలో మా ప్రభుత్వ అనుభవాన్ని మీతో పంచుకుంటాను. పేదలకు 3 కోట్ల కొత్త పక్కా గృహాలు ఇచ్చాం. రూ.9 లక్షల కోట్ల ఇన్ఫ్రా ప్రాజెక్టులపై పని మొదలైంది. 15 వందేభారత్ రైళ్లు ప్రారంభించాం. 8 కొత్త ఎయిర్ పోర్టుల పనికి శ్రీకారం చుట్టాం. యువతకు రూ.2 లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చాం. రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లను బదిలీ చేశాం. 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత వైద్యానికి ఏర్పాట్లు చేశాం. 5 లక్షల ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశాం. స్టాక్ మార్కెట్ సూచీల్లో దాదాపు 7 శాతం వృద్ధి నమోదైంది. విదేశీ మారకద్రవ్యం 700 బిలియన్ డాలర్లను దాటేసింది. నేను కేవలం 125 రోజుల్లో జరిగిందే చెబుతున్నాను. ఈ కాలంలో భారత్‌లో ప్రపంచం మూడు విషయాలు చర్చించడానికి వచ్చింది. టెలికామ్-డిజిటల్ ఫ్యూచర్‌పై అంతర్జాతీయ అసెంబ్లీ జరిగింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్ నిర్వహించారు. గ్లోబల్ సెమీకండెక్టర్ ఎకోసిస్టమ్‌పై సదస్సు జరిగింది. ఇవి భారత్ దిశ.. ప్రపంచం ఆశను తెలియజేస్తున్నాయి. ప్రపంచ భవిష్యత్తును భారత్ నిర్ణయిస్తుంది. మా ప్రభుత్వ మూడో విడత పాలనతో రేటింగ్ ఏజెన్సీలు దేశ వృద్ధిరేటును గణనీయంగా పెంచాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.



## 'విమానంలో బాంబు ఉందని బెదిరిస్తే జైలు శిక్ష'

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

విమానాలపై బాంబు బెదిరింపులకు పాల్పడే వారిని నో ఫ్లై లిస్ట్‌లో చేర్చుతామని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎయిర్ క్రాఫ్ట్ సెక్యూరిటీ నిబంధలను కూడా సవరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇటీవల వరసగా వస్తున్న బాంబు బెదిరింపుల గురించి చర్చించి ఈ మేరకు చట్టాలను సవరిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను వారెంట్ లేకుండానే అరెస్ట్ చేసే నేరంగా పరిగణిస్తామని, చట్టంలో మార్పుల ప్రకారం కఠిన శిక్షలు, జరిమానా ఉంటుందని తెలిపారు. విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని అన్నారు. ఇటీవల దేశంలో అనేక విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో దిల్లీలో ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు.

"ఎప్పుడు బాంబు బెదిరింపు కేసు వచ్చినా, అది ఫోన్ ద్వారా, సోషల్ మీడియా, ఇతర మార్గాల్లో ఎలా వచ్చినా కచ్చితమైన ప్రోటోకాల్ పాటిస్తాం. ప్రయాణికుల భద్రతే మాకు ముఖ్యం. ఇందుకు అంతర్జాతీయ మార్గదర్శకాలు ఉన్నాయి. విమానంలో భద్రతాపరమైన సమస్య తలెత్తినప్పుడు ఏం చేయాలో చెప్పే కఠినమైన నిబంధనలు ఉన్నాయి. వాటిలో చిన్న సవరణ ద్వారా ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న సమస్యను నివారించవచ్చు. ఈ సవరణ ద్వారా బెదిరింపుల వెనకున్న వారిని పట్టుకున్న తర్వాత వారిని నోఫ్లయింగ్ జాబితాలో చేర్చాలన్నది మా ఆలోచన. రెండోది సప్రెషన్ ఆఫ్ అన్‌లాఫుల్ యాక్ట్ ఎగైనస్ట్ సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్ట్. దీన్ని స్వాస్కా యాక్ట్ అంటారు. ఈ స్వాస్కా యాక్ట్‌లో సవరణకు మేము ప్రయత్నిస్తాము. తద్వారా విమానం గ్రౌండ్‌లో ఉన్నప్పుడు చేసే ఇలాంటి తప్పులను వారెంట్ లేకుండానే అరెస్ట్ చేసే నేరంగా పరిగణించి వారిపై కచ్చితమైన చర్యలు తీసుకోవచ్చు." అని తెలిపారు.

గత వారం రోజుల్లో భారతతీయ విమానయాన సంస్థలకు చెందిన దాదాపు 100 విమానాలకు బెదిరింపు కాల్స్? వచ్చాయని కేంద్ర మంత్రి తెలిపారు. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ–బీసీఏఎస్, ఈ కాల్స్‌కు సంబంధించి హోం శాఖతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని చెప్పారు.

## ప్రజలపై భారీగా విద్యుత్ బిల్లుల భారం మోపే అవకాశం




- మాజీ మంత్రి కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రజలపై భారీగా విద్యుత్ బిల్లుల పేరుతో భారం మోపనున్నట్లు తమకు సమాచారం అందిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచాలంటూ 9 ప్రతిపాదనలు ఏవైతే డిస్కంలు చేశాయో వాటిని విరమించుకోవాలని ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమిటీ ఛైర్మన్‌ను కలిసి కోరామని తెలిపారు.

ఇళ్లలో వాడుకునే కరెంట్ కు సంబంధించి నెలకు రూ. 300 యూనిట్లు దాటితే ఫిక్స్ ఛార్జీలు 10 రూపాయల నుంచి ఏకంగా రూ. 50 పెంచాలని ప్రతిపాదన చేశారు. ఇది అతి ప్రమాదకరమైన ప్రతిపాదన. ఈ ఒక్క నిర్ణయం మొత్తం ప్రజల ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లోకి నెడుతుంది అన్నారు. సామాన్యుల గృహాలకు సంబంధించి బలంగా, భారీగా విద్యుత్ బిల్లుల భారం పడుతుంది. పరిశ్రమలన్నింటినీ ఒకే కేటగిరీ అనే ప్రతిపాదన చేస్తున్నారు.ఇది చాలా అసంబద్ధమైన, సిల్లీ ఆలోచన. పరిశ్రమలకు తీవ్ర అన్యాయం చేసే నిర్ణయం.

దేశంలో ఎప్పుడూ లేని విధంగా ఇలాంటి పిచ్చి ఆలోచన చేస్తున్నారు. పరిశ్రమలన్నింటికీ ఒకే టారిఫ్ చేసే విధంగా చేయటమంటే అది రాష్ట్ర ప్రగతికి గొడ్డలి పెట్టుగా మారుతుంది. ఇప్పటికే రాష్ట్రంలో పారిశ్రామిక రంగం మందగమనంలో ఉంది. ఫాక్స్ కాన్ సంస్థ కూడా తమ విస్తరణకు సంబంధించి వాళ్లు ఏమీ చెప్పటం లేదు అన్నారు.మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రా అంటున్నారు. కానీ మన తెలంగాణ పేరు చెప్పటం లేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేన్స్ సహా కొన్ని పరిశ్రమలు వేరే రాష్ట్రాలకు తరలిపోయాయి. ప్రభుత్వ అసంబద్ధమైన నిర్ణయాల కారణంగానే ఇలాంటి పరిస్థితి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం మోటార్లకు మీటర్లు పెట్టాలన్న అంశానికి సంబంధించి కూడా ఈ ప్రభుత్వం ఏమీ చెప్పటం లేదు.

విద్యుత్ సరఫరా విషయంలో ఇప్పటికే ప్రజలు విసిగిపోయి ఉన్నారు.

కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కూడా డిస్కం లు ఛార్జీలు పెంచాలని ప్రతిపాదించాయి. ట్రూ అప్ ఛార్జీలు 12 వందల కోట్లు కావాలంటే అప్పుడు కేసీఆర్ గారు మేమే భరిస్తామని ప్రజల మీద ఆ భారం పడనియలేదు. విద్యుత్ ను మేము కేవలం వ్యాపార వస్తువుగా చూడలేదు. అది సామాన్యుడి జీవితంలో దైనందిక అవసరమని భావించాం. అందుకే మేము రాష్ట్రంలో ఉచిత విద్యుత్ ను రైతులకు అందించాం. 24 గంటల కరెంట్ ఇచ్చాం అని కేటీఆర్ అన్నారు.

నాయి బ్రహ్మణులు, రజకులకు ఫ్రీ కరెంట్, దళితులకు ఉచిత కరెంట్ ఇచ్చే ప్రయత్నం చేశాం. రాష్ట్రం ఏర్పడిన నాడు 7 వేల మెగావాట్ల సామర్థ్యం ఉంటే దాన్ని 24 వేల మెగావాట్లకు తీసుకెళ్లాం. విద్యుత్ ఛార్జీలను పెంచితే అది రాష్ట్ర ప్రగతికి గొడ్డలి పెట్టుగా మారుతుంది. విద్యుత్ ఛార్జీల పెంపు అనేది రాష్ట్ర అభివృద్ధి అంశంతో ముడిపడి ఉన్నది. సిరిసిల్లలో పవర్ లూమ్ పరిశ్రమ, కాటేదాన్ లో పరిశ్రమలకు 50 శాతం సబ్సిడీ ఇచ్చాం. ఈ ప్రతిపాదనలతో వారికి సబ్సిడీ

లేకుండా పోతుంది. అడ్డగోలుగా ఛార్జీలు పెంచుతామంటే అంగీకరించవద్దని ఈఆర్సీ ఛైర్మన్ ను కోరామన్నారు. ఈ నెల 23 నాడు పబ్లిక్ హియరింగ్ లో పాల్గొనాలని ఈఆర్సీ ఛైర్మన్ కోరారన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు రెండు రోజుల ముందే ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం.

ప్రభుత్వ ఆనాలోచిత నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ 23 న హియరింగ్స్ లో మా వాదనలు వినిపిస్తాం.అశోక్ నగర్ వెళ్లకుండా నన్ను అడ్డుకుంటే

మిగితా 3వ పేజీలో

## తొలిరోజు ప్రశాంతం



- ప్రారంభమైన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష
- ప్రాజరైన 31,383 మంది

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సుప్రీంకోర్టు సైతం ఈ విషయంలో జోక్యం చేసుకోబోమని స్పష్టంచేయటం, మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించటంతో మెయిన్స్‌కు ఉన్న అవాంతరాలు తొలగిన్నట్లైంది. పరీక్షకు మొత్తం 31,383 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం పన్నెండున్నర నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించిన అధికారులు, 1:30 గంటలకు గేట్లు మూసివేశారు. ఆలస్యంగా వచ్చిన పలువురిని ఎగ్జామ్ రాసేందుకు అనుమతించలేదు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఇవాళ్టి నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఎగ్జామ్ సెంటర్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. పరీక్షలను వాయిదా వేయాలని ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోని 46 పరీక్ష కేంద్రాల వద్ద ఆయా కమిషనర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ విధించారు. దీంతో పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఐదుగురికి మించి ఉండేందుకు వీల్లేదు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక ఎస్సై ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుల్ సహా మొత్తం ఆరుగురు కానిస్టేబుళ్లు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఎగ్జామ్ రూమ్, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలించారు. పరీక్షలకు సంబంధించి రోజూ ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాలను జీపీఎస్ ట్రాకింగ్ అమర్చిన వాహనాల్లో తరలించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో నిర్దేశిత మార్గాల్లోనే ఆ వాహనాలు

## భారత్ లౌకిక దేశంగా ఉండొద్దా?

- సుప్రీంకోర్టు
- రాజ్యాంగ పీఠిక నుంచి సెక్యులర్, సోషలిస్ట్ అనే పదాలను తొలగిం చాలంటూ దాఖలపై ప్రజాప్రయోజన వ్యాజ్యాలను విచారించిన కోర్టు

వివరాలు 3వ పేజీలో

## త్వరలో తెలంగాణలో సమగ్ర కుల గణన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

: తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను నిర్ణయించేందుకు జరగనున్న అన్ని కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమగ్ర సర్వే షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వివరించినట్లు బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ తెలిపారు. అంతకుముందు రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌ను బీసీ కమిషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. కమిషన్ ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలు, సమగ్రంగా సేకరించిన కులాల వివరాలను గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8 వరకు ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కులాల వారీగా సమగ్రంగా వివరాలు సేకరిస్తామని నిరంజన్ తెలిపారు.

## పోలీసు అమరుల త్యాగం

# భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది..

- పోలీస్ అమరవీరుల త్యాగనిరతి ఫలితమే నేడు కనిపిస్తున్న శాంతి,సౌభ్రాతృత్వం..
- పోలీస్ అమరవీరుల త్యాగాలు స్మరిస్తూ వారి ఆశయాలు కొనసాగిద్దాం
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

అమరుల త్యాగాలు,ఆశయాల సాధన దిశగా ముందుకు సాగాలని,ప్రజల కోసం తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టిన పోలీస్ అమరవీరుల త్యాగనిరతి ఫలితమే నేడు కనిపిస్తున్న శాంతి, సౌభ్రాతృత్వం అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులో అమరవీరుల స్తూపం వద్ద అమరవీరుల కుటుంబ సభ్యులు,పోలీస్ అధికారులతో కలసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,ఎస్పీ అఖిల్ మహాజన్ నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో 08 మందికి పైగా పోలీసులు అసువులు బాసారని,వారి త్యాగ ఫలం వల్లే గతం కంటే ప్రస్తుత పరిస్థితి మెరుగ్గా ఉందని,పోలీసుల త్యాగనిరతిని నిరంతరం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఇట్టి కార్యక్రమానికి హాజరైన త్యాగమూర్తుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థుతులు వారి యొక్క సమస్యలను అడిగి వారు చెప్పిన సమస్యలను సాధ్యమైన%శీ%త తొందరగా పరిష్కరిస్తాం అని హామీ ఇచ్చి అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందించినారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ పోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని,ప్రజావసరాల కోసం, సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతి సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. శాంతిభద్రతలు సక్రమంగా ఉంటే మారుమూల గ్రామాలకు కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.అక్టోబర్ 21 నుంచి 31 వరకు జాతీయ ఐక్యత కోసం ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు.



అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సమాజంలో శాంతి స్థాపన కోసం అసాంఘిక శక్తులతో జరిపిన పోరులో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరనీయమని , అమరవీరులు అందించిన స్ఫూర్తితో ప్రజల భద్రత, రక్షణ చర్యల్లో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందుకు సాగుతున్నామన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందని అన్నారు . దేశ సరిహద్దుల్లోని ఆక్సాయ్ చిన్ ప్రాంతంలో పహార కాస్తున్న 10 మంది సిఆర్పిఎఫ్ పోలీసులను 1959లో ఇదే రోజున చైనా దేశానికి చెందిన సైనికులు హతమార్చారని, అప్పటినుండి వారి త్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినం జరుపుకోవడం జరుగుతున్నదని అన్నారు . విధి నిర్వహణ సందర్భంగా ఎన్నో జటిలమైన సవాళ్లు ఎదురవుతున్నా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు .

దేశవ్యాప్తంగా ఈసంవత్సరంలో తీవ్రవాదులు,సంఘ విద్రోహక శక్తుల్లో 214 మంది పోలీసులు అమరులయ్యారనీ, వారి త్యాగాలను స్మరించుకుంటూ వీరమరణం పొందిన త్యాగమూర్తుల కుటుంబాల సంక్షేమం, వారికి ఆర్థిక పరమైన ప్రయెజనాలను సర్వస్వం లభింపచేయడం,అయా కుటుంబాలకు మానసిక బలాన్ని అందించటమే పోలీసు అమర వీరులకు మనం అందించే నిజమైన నివాళిఅని అన్నారు .

పోలీస్ అమరవీరుల స్మరిస్తూ పోలీస్ వారి ఆధ్వర్యంలో ఈ రోజు నుండి 31 తేదీ వరకు రక్తదాన శిబిరాలు,సైకిల్ ర్యాలీ,క్యాండిల్ ర్యాలీ,2కే రన్,ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు, ఫోటో, వీడియో పోటీలు నిర్వహించడం జరుగుతుందని,పోలీస్ అమరవీరుల కుటుంబాలకు దగ్గరికి వెళ్లి వారి త్యాగాలకు గుర్తుగా నివాళులు అర్పించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ మురళి కృష్ణ, సిఐ లు,ఆర్ఐ లు, ఎస్ఐ లు, సిబ్బంది అమరుల కుటుంబ సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.

## విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్‌పై పోక్సో కేసు

- విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు...
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

విద్యార్థినిలు, మహిళలు పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని గీతనగర్ లో గల గర్ల్స్ హై స్కూల్ లో సోమవారం జిల్లా షీ టీం సిబ్బంది మహిళ చట్టాలపై, షీ టీమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొంత మంది విద్యార్థులు షీ టీం సిబ్బంది వద్దకు వచ్చి టీచర్ నరేందర్ కొద్ది రోజులుగా క్లాస్ రూమ్ లో విద్యార్థునుల పట్ల బ్యాడ్ టచ్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడాని ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన జిల్లా షీ టీమ్ సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో టీచర్ నరేందర్ పై పోక్సో చట్టం క్రింద కేసు నమోదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని తెలిపారు.

జిల్లాలో మహిళలను, విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తున్న పోకిరీలపై 38 కేసులు,44 పెట్టి కేసులు నమోదు చేసి పోకిరీల ఆటకట్టిస్తు సత్ఫలితలు సాధిస్తూ జిల్లాలో మహిళలకు,విద్యార్థినులకు అండగా జిల్లా షీ టీమ్ నిలుస్తున్నదని మహిళలు, విద్యార్థులకు నిర్భయంగా ముందుకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. సోషల్ మీడియా వేదికగా కానీ,పని చేసే ప్రదేశాల్లో కానీ,పాఠశాలలో,కళాశాలల్లో మహిళలను ,విద్యార్థినులకు వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని , మహిళలు ,విద్యార్థినులు వేధింపులకు గురైనట్లయితే వెంటనే షీ టీం నెంబర్ 87126 56425 కి పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,పిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.




## కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వోరగంటి

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్ళపల్లి మండలం జిల్లెళ్ల లోని హార్వెస్ట్ మినిస్ట్రీస్ సహకారంతో తిరుపతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో నాలుగు నెలలు శిక్షణ అనంతరం కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమీషన్ సభ్యులు వోరగంటి ఆనంద్ హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు మరియు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించుకొని ఆర్థిక స్వతంత్ర దిశగా అడుగులు వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో హార్వెస్ట్ మినిస్ట్రీస్ డైరెక్టర్ కెలెబ్ రాయపాటి, కో ఆర్డినేటర్ జి.శ్రీధర్,పాస్టర్ సామ్యేల్,దళిత పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి సందీప్,గ్రామస్తులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కట్నం కోసం

# భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు...

**బలగం టీవీ, ముస్తాబాద్**

అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతో పాటు రూ. 10000/- రూల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోమకొండ మండలం తుల్జాపూర్ గ్రామానికి చెందిన సుంకరి రాజు కు ముస్తాబద్ మండలం గూడెం గ్రామనికి చెందిన మేఘమాల తో 2010 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి ఒక అబ్బాయి సంతానం కలుగగా,కొన్నేళ్ల తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురి చేసిండని తెలిపారు.వేధింపులు భరించలేక మేఘమాల 2015 సంవత్సరంలో ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ సుంకరి రాజు పై ఫిర్యాదు చెయ్యక అప్పుటి ఎస్సై మారుతి కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదించగా ముస్తాబాద్ ఎస్ఐ. గణేశ్, సీఎంస్ ఎస్ఐ.రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నిందుతుడు సుంకరి రాజు పై నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి ప్రవీణ్ ఏడాదిన్నర జైలు శిక్షతో పాటు రూ. 10000/- రూల జరిమానా విధించినట్లు తెలిపారు.



## చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని నేరళ్ళ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని జిల్లెళ్ళ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎ ఏం సి చైర్మన్ వేముల స్వరూప తిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గతంలో కంటే వరి ధాన్యం ఎక్కువగా వచ్చిందని రైతులు పండించిన వరి ధాన్యం పంటను ప్రతి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. గతంలో లారీల కొరత ఇబ్బందిగా ఉందని రైతులు తెలపడంతో ఈసారి ఎలాంటి సమస్య రాకుండా పరిష్కరిస్తామని రైతులకు భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కోడూరు భాస్కర్ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నరసింగం గౌడ్, మాజీ సర్పంచ్ మాట్ల మధు, పొన్నాల పరశురాములు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి..



- 17వ బెటాలియన్ కమాండెంట్ యస్.శ్రీనివాస రావు

**బలగం టీవీ, సిరిసిల్ల**

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి అని 17వ బెటాలియన్ కమాండెంట్ యస్.శ్రీనివాస రావు అన్నారు.సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా 17వ బెటాలియన్ సర్దాపూర్ నందు నిర్వహించిన స్మృతి పరేడ్ కార్యక్రమానికి 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని,విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కమాండెంట్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ 1959 వ సంవత్సరంలో భారత్ చైనా సరిహద్దులో విధి నిర్వహణలో అమరులైన భారత పోలీసులను స్మరించుకుంటూ, దానికి గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినోత్సవం నిర్వహించుకుంటామని అన్నారు.విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మనకు స్ఫూర్తి అన్నారు. పగలు రాత్రి తేడా లేకుండా సమాజంలో శాంతి భద్రతలను కాపాడుతూ అవసరమైతే ప్రాణత్యాగం చేయడానికి కూడా పోలీసులు వెనుకాడరని అన్నారు . తీవ్రవాదం, ఉగ్రవాదం, మతతత్వ దోరణిలో సంఘ విద్రోహక శక్తులు హింసలకు పాల్పడుతున్నాయని, ఇలాంటి శక్తుల్ని ఎదుర్కొంటూ ఎందరో పోలీసు సోదరులు వీరమరణం పొందారన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. పోలీసుల అమరత్వం నుంచి స్ఫూర్తిని, ప్రేరణ పొందుతున్నామన్నారు.పోలీసు అంటేనే పట్టుదల, ఓర్పు, సహనమని శాంతి భద్రతలు కాపాడేందుకు వారు చేసే కృషి మరువలేనిదన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ శ్రీ ఉదయ్ భాస్కర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీమతి ప్రమీల,అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలి



- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ,సిరిసిల్ల**

పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా,సేవించడం వంటి వాటిపై , అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ కట్టడి చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం వార్షిక తనిఖీల్లో భాగంగా వీర్నపల్లి పోలీస్ స్టేషన్ ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలు, స్టేషన్ రికార్డ్స్ ,వర్టికల్స్ అమలు తీరు,స్టేషన్ లో విధులు నిర్వహించే సిబ్బంది కిట్ ఆర్టికల్స్, పెండింగ్లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సి.డి ఫైల్స్ లను తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అధికారులు,సిబ్బందికి అంకితభావంతో విధులను నిర్వర్తించాలన్నారు.నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని,విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామాల్లో తరచు పర్యటిస్తూ ప్రజలతో సస్సంబంధాలు కలిగి ఉండాలని, గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం విపివో ల దగ్గర ఉండాలని ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలన్నారు.

బ్లూ కోల్ట్ సిబ్బంది డయల్ 100 కాల్ రాగానే వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని సమస్యలు పరిష్కరించాలని, రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించే బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు, సస్పెక్ట్ లు, రౌడీ షీటర్లపై నిఘాను ఉంచాలన్నారు. ఈ కార్యక్రమం లో సిఐ శ్రీనివాస్, ఎస్ఐ ఎల్లగౌడ్, సిబ్బంది ఉన్నారు.



## ప్యాక్స్ సిరిసిల్ల ఆధ్వర్యంలో పెట్రోల్ డీజిల్ పంపు పునః ప్రారంభం

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో సిరిసిల్ల ప్యాక్స్ ఆధ్వర్యంలో డీజిల్ పెట్రోల్ బంక్ ను ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్ గౌడ్ మరియు పాలక వర్గ సభ్యులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, డైరెక్టర్స్ గడిల సురేష్, వెన్నమనేని శ్రీధర్ రావు,మీరాల భాస్కర్ యాదవ్,బండి దేవేందర్ యాదవ్,సత్తు వెంకట్ రెడ్డి, కొమ్మట పర్శయ్య,గణ్య నాయక్,శెనిగరపు లక్ష్మి సీఈఓ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల:**

ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా వచ్చే అర్జిల పరిష్కారంలో జాప్యం వద్దని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఆర్డీఓ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

**బలగం టీవీ, సిరిసిల్ల :**

జిల్లాలోని పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చెయ్యాలని రాజన్న సిరిసిల్ల ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ అన్నారు.భారత విద్యార్థి ఫెడరేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతున్నారని, పిల్లల తల్లిదండ్రులే స్వయంగా డబ్బులు వేసుకొని వేరొక ప్రైవేటుగా ఉపాధ్యాయుని కేటాయించుకొని, జీతం ఇస్తున్న పరిస్థితి కొన్ని పాఠశాలల్లో నెలకొందని అన్నారు.ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులు చేరిన కూడా చాలా పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేని పరిస్థితి నెలకొంది అని,తద్వారా



విద్యార్థులు ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు.ఎక్కువమంది విద్యార్థులు ఉన్నచోట సరిపడ ఉపాధ్యాయులు లేరని ఒక్కరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులతోనే పాఠశాల గడుస్తుందని అన్నారు. అలాంటి పాఠశాలకు వెంటనే ఉపాధ్యాయులను కేటాయించాలని కలెక్టర్ సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్, కుర్ర రాకేష్ , నాయకులు సామల్ల సాయి భరత్, కడారి శివ, దినాకర్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ లౌకిక దేశంగా ఉండొద్దా?

- సుప్రీంకోర్టు
- రాజ్యాంగ పీఠిక నుంచి సెక్యులర్, సోషలిస్ట్ అనే పదాలను తొలగిం చాలంటూ దాఖలపై ప్రజాప్రయోజన వ్యాజ్యాలను విచారించిన కోర్టు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



రాజ్యాంగ పీఠిక నుంచి సోషలిస్ట్ అనే పదాలను తొలగించాలంటూ దాఖలపై ప్రజాప్రయోజన వ్యాజ్యాలను విచారించిన సుప్రీంకోర్టు పిటిషనర్లపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సోషలిస్ట్, సెక్యులర్ పదాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో భాగమని కోర్టులు ఇప్పటికే పలు తీర్పుల్లో నొక్కి చెప్పాయని పేర్కొంది. ఈ రెండు పదాలను రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించాలంటూ బీజేపీ నేత, మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి సహా పలువురు దాఖలు చేసిన వ్యాజ్యాలను జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్, అడ్వకేట్ అయిన విష్ణుశంకర్‌జైన్ తన వాదనలు వినిపిస్తూ 1976లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణపై పార్లమెంటులో అసలు చర్చే జరగలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన జస్టిస్ ఖన్నా.. సోషలిజం అంటే అందరికీ సమాన అవకాశాలు కల్పించడమేనని, దాని భావన సమానత్వమేనని స్పష్టం చేశారు. దీనిని పాశ్చాత్య ధోరణిలో చూస్తే వేరే అర్థం వస్తుందని పేర్కొన్నారు. సెక్యులరిజం అనే పదం కూడా అంతేనని నొక్కి చెప్పారు. మరో న్యాయవాది అశ్వనీ ఉపాధ్యాయ్ తన వాదనలు వినిపిస్తూ ఇందిరాగాంధీ ప్రభుత్వం అత్యయిక స్థితి విధించిన సమయంలో ఈ సవరణ ప్రభావితమైందని చెప్పారు. లాయర్ల వాదనలకు జస్టిస్ ఖన్నా స్పందిస్తూ.. 'భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడం లేదా?' అని ప్రశ్నించారు. సుబ్రమణ్యస్వామి కూడా తన వాదనలు వినిపించారు. అనంతరం ధర్మాసనం తదుపరి విచారణను నవంబర్ 18కి వాయిదా వేసింది.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

లేదన్నారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగ మించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)ల ను ఉపయోగించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు అవసరమయ్యే సాంకేతికత, ఇతర సదుపాయాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# దుబాయిలో సిరిసిల్ల నేతన్న ఆవిష్కరణలు..

**బలగం టీవీ , సిరిసిల్ల :**

సిరిసిల్ల చేనేత కళకు వన్నెతెచ్చిన కళాకారుడు వెల్ది హరిప్రసాద్ అద్భుత ఆవిష్కరణలు దుబాయి వాసులను ఆకట్టుకున్నాయి. దుబాయి లోనిఎమిరేట్స్ పద్మశాలి అసోసియేషన్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆహ్వానం మేరకు దుబాయి వెళ్లిన నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ కు అరుదైన గౌరవం దక్కింది. దుబాయ్ పద్మశాలి అసోసియేషన్ గుత్తికొండ రవిచంద్ర,సరస్వతిలు సిరిసిల్ల నేత కళాకారుని అరుదైన ప్రతిభను గుర్తించి దుబాయ్ కి ఆహ్వానించారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో హరి ప్రసాద్ తన చేతిలో చేనేత మగ్గంపై రూపాదిద్దుకున్న ఎన్నో అరుదైన ఆవిష్కరణలను ప్రదర్శించారు. రాజన్న సిరిపట్టుచీరలతోపాటు అంతరించిపోయిన పట్టు పీతాంబరాలను పునసృష్టించిన హరి ప్రసాద్ ఆ చీరలను దుబాయ్ వేదికగా ప్రదర్శించారు. అగ్గిపెట్టెలో పట్టే



పట్టుచీర,దబ్బనంలో,ఉంగరంలో దూరే పట్టుచీరలతో పాటు వస్త్రాలపై నూలు పోగుల అల్లికతో రూపొందించిన పలు చిత్రపటాలను కూడా ఈ సందర్భంగా హరిప్రసాద్ ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నారు . ఇప్పటికే చేనేత రంగంలో అనేక ఆవిష్కరణలు చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న హరిప్రసాద్, జీ 20 లోగోను వస్త్రం పై నేసి దేశ ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు అందుకున్న సంగతి తెలిసిందే. సిరిసిల్ల పట్టణంలోని మధ్యతరగతి పద్మశాలి కుటుంబంలో జన్మించిన హరి ప్రసాద్ తన సొంత తెలివితేటలతో, చేనేత కళపై మక్కువతో మగ్గంపై అద్భుత ఆవిష్కరణలు చేస్తున్నాడు. ఈ కోవలో తన ప్రతిభను గుర్తించి దుబాయ్ దేశానికి ఆహ్వానించడం పట్ల దుబాయ్ఎమిరేట్స్ పద్మశాలి అసోసియేషన్ సభ్యులకు హరిప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. మరియు గుత్తికొండ రవిచంద్ర,సరస్వతిలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రజలపై భారీగా విద్యుత్ బిల్లుల భారం మోపే అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

పిల్లలో తెలంగాణ భవన్ కు వచ్చి కలిశారు. వారు కోరటంతో మేమే కపిల్ సిబాల్ లాంటి లాయర్ ను పెట్టి సుప్రీంకోర్టులో కేసు వేశాం. శుక్రవారమే విచారణ జరుగుతుందని భావించాం. కానీ సోమవారం విచారణకు తీసుకున్నారు. సుప్రీంకోర్టు మేము లేవనెత్తిన ఏ అంశాన్ని వ్యతిరేకించలేదు. జీవో 29 పై తీర్పు వచ్చే వరకు రిజల్ట్స్ ఇవ్వవద్దని తెలిపింది. అదే విధంగా పిటిషన్ ను వేగంగా విచారణ జరపాలని కోరిందని కేటీఆర్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లకు అనుగుణంగా మేము జీవో నంబర్ 55 ను తీసుకొచ్చాం. ఓపెన్ కోటాలో కూడా మెరిట్ ప్రకారం అందరికీ అవకాశం కల్పించాం. జీవో 29 అనేది ఓపెన్ కోటాను కూడా రిజర్వ్ చేసేలా ఉంది.

ఫిబ్రవరి నుంచే మేము ఇది అన్యాయమైన జీవో అని చెబుతూనే ఉన్నాం. మా పార్టీ నాయకులు హరీష్ రావు, దాసోజు శ్రవణ్, ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ లు దీనిపై మాట్లాడారన్నారు. కోర్టు కేసు తేలేదాక మేము విద్యార్థులకు అండగా ఉంటాం.ఆ విద్యార్థులు అడిగింది ఏముంది? వాళ్ల డిమాండ్లను ఎందుకు పరిష్కరించలేదు.

జీవో నంబర్ 29 రాజ్యాంగ విరుద్ధమని చెప్పటం తప్పా? లోకల్స్ కు 95 శాతం రిజర్వేషన్లను కేసీఆర్ తెచ్చారు. కానీ దాంట్లో నాన్ లోకల్స్ వచ్చేలా కుట్రలు చేస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. తెలుగు అకాడమీ ప్రామాణికం కాదని చెబితే ఎట్ల అని ప్రశ్నిస్తున్నారు. ఈ అన్ని అంశాలు తేలే వరకు ఎగ్జామ్స్ రీ షెడ్యూల్ చేయమంటే ప్రభుత్వానికి ఎందుకంత ఈగో. రేవంత్ రెడ్డి తన చర్య ద్వారా బలహీన వర్గాల పై ఉన్న వ్యతిరేకతను చాటుకున్నారు.

జీవో 29 ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల ను పెద్ద తీసే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణేతరులకు కూడా ఈ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రయోజనాలు కల్పించే కుట్ర చేస్తోంది. ఎగ్జామ్ విషయంలో ప్రభుత్వం మూర్ఖంగా, మొండిగా పోయిందన్నారు. జీవో 29 విషయంలో పిల్లల తరపున టాప్ లాయర్ ను పెట్టి కొట్లాడుతాం. మా మీద తప్పుడు ప్రచారం చేసి ఆ పిల్లలను నమ్మించి వారి వల్లనే మీరు గద్దెనెక్కారు.

# రైతులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం..



- ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్

**బలగం టీవీ , వేములవాడ**

రైతు ఆమోదయోగ్యమైన అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నమని ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో మార్కెట్ యార్డ్ కోసం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలసి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, స్థల పరిశీలన చేశారు.

ఈ సందర్బంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు అనుగుణంగా ఉండేందుకు ప్రస్తుతం వేములవాడలో కొనసాగుతున్న మార్కెట్ యార్డ్ ను మర్రిపల్లిలో ప్రధాన రోడ్డుకు అనుకొని ఉన్న విశాలమైన స్థలంలోకి మార్చేందుకు రెవెన్యూ , ఇంజనీరింగ్, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులతో కలిసి స్థల పరిశీలన చేస్తున్నావని అన్నారు.రైతులతో పాటు సామాన్య ప్రజలు, క్రీడాకారుల అవసరాల కోసం వ్యవసాయ మార్కెట్ కు అనుసంధానంగా వేములవాడలో ఉన్న మిని స్టేడియం వలే ఇక్కడ విశాల విస్తీర్ణంలో మినీ స్టేడియం, క్రికెట్ గ్రౌండ్ నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు.

ప్రజా అవసరాలు తీర్చేలా భూములు అభివృద్ధి చేసేందుకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ భూములను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేలా చర్యలు చేపడతామని అన్నారు.భూమిని ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై అధికారులతో చర్చించి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తామని అన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం...




- ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్


**బలగం టీవీ, వేములవాడ**

కాంగ్రెస్ రైతు సంక్షేమ ప్రభుత్వమని, రైతును రాజు చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి సంకల్పమని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలోని బాలనగర్ లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి. వేములవాడ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్బంగా ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతును రాజు చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం అని అన్నారు.

సన్నరకం వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుంది అని,20 సంవత్సరాల క్రితం దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని,కొనుగోలు కేంద్రాల నిర్వహణను మహిళా సంఘాలకు,ప్యాక్స్, డీసీఎంఎస్ లకు అప్పజెప్పడం జరిగింది అని అన్నారు.రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులకు ఉచిత విద్యుత్ పంపిణీ ఫైల్ పై అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి తొలి సంతకం చేయడం జరిగింది అన్నారు.క్షేత్ర స్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది అని, రైతులకు సరిపడా టార్ఫలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని అన్నారు.

ఒకవేళ అకాల వర్షాల వల్ల రైతులకు ఏమైనా ఇబ్బందిగా తలెత్తితే తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది అని, గతంలో లారీల కొరత ఉంటే దానిని అధిగమిస్తూ ప్రస్తుతం ఐదు ఏజెన్సీలకు లారీలను సరఫరా బాధ్యత అప్పజెప్పడం జరిగింది అని అన్నారు. రైతులకు మేలు కలిగే కార్యక్రమాలు రాబోయే రోజుల్లో చర్యలు తీసుకుంటామని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు భూసర పరీక్షలు నిర్వహించి దానికి అనుగుణంగా కొత్త వంగడాలను సరఫరా చేయాలి అని అన్నారు.

రైతులకు ఏకకాలంలో 2లక్షల రుణమాఫీ చేసామని,సాంకేతిక సమస్య వల్ల మాఫీ కానీ రైతుల ఖాతాల్లో జమ చేయడానికి వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు అని అన్నారు.




# ‘ది రాజా సాబ్’ స్టైలిష్ లుక్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

అక్టోబర్ 23న పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘ది రాజా సాబ్’ నుండి ఓ స్టైలిష్ అప్డేట్‌ను మేకర్స్ ఇచ్చారు. ‘ది రాజా సాబ్’ సినిమా నుండి ఓ సరికొత్త స్టైలిష్ పోస్టర్‌ను వారు రిలీజ్ చేశారు. ఇందులో ప్రభాస్ డార్లింగ్ లుక్‌లో కనిపించడంతో పాటు ఆయన తనదైన స్వాగ్‌తో ఇచ్చిన పోజ్ హైలైట్‌గా నిలిచింది. క్యాజువల్ వేర్స్‌తో వింటేజ్ ప్రభాస్ కూల్ లుక్స్‌తో అదరగొట్టాడని అభిమానులు సంబరపడుతున్నారు. ఇక ఆయనను ఈ తరహా పోస్టర్‌లో చూసి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాను దర్శకుడు మారుతి డైరెక్ట్ చేస్తుండగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ.విశ్వప్రసాద్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. అక్టోబర్ 23న ఈ చిత్రానికి సంబంధించి మరో ట్రీట్ ఉండనుందని మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమా 2025 ఏప్రిల్ 10న విడుదల కానుంది.




# ‘బఘీరా’ ట్రైలర్ విడుదల

## కథను అందించిన ప్రశాంత్ నీల్



**బలగం టీవీ, హైదరాబాద్**

‘కేజీఎఫ్’, ‘సలార్’ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ స్టోరీ అందిస్తున్న తాజా చిత్రం బఘీరా. కన్నడ రోరింగ్ స్టార్ శ్రీమురళి హీరోగా వస్తున్న ఈ చిత్రంలో సప్త సాగరాలు దాటి ఫేమ్ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుంది. ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ సినిమాకు డాక్టర్ సూరి దర్శకత్వం వహిస్తుండగా.. ‘కేజీఎఫ్’, కాంతారా చిత్రాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నిర్మాణ సంస్థ హెూంబలే ఫిల్మ్స్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ చూస్తుంటే శ్రీమురళి రెండు పాత్రలతో అలరించబోతున్నట్లు తెలుస్తుంది. ఇందులో ఒకటి పోలీస్ పాత్ర కాగా.. మరోకటి ‘బఘీరా’ అనే సూపర్ హీరో పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఫుల్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఉన్న ఈ ట్రైలర్ కేజీఎఫ్ తరహాలో ఉండగా.. మాస్ సినిమాలు అభిమానించేవారికి ఫుల్ మీల్స్ అని తెలుస్తుంది. ఈ సినిమాను తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు.



# రబాడ అరుదైన ఘనత

**బలగం టీవీ, హైదరాబాద్**

సౌతాఫ్రికా పేసర్ కగిసొ రబాడ అరుదైన ఘనత సాధించాడు. టెస్టుల్లో అతి తక్కువ బంతుల్లో 300 వికెట్ల మైలురాయి అందుకున్న తొలి బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. టెస్టు కెరీర్‌లో రబాడ 11,817 బంతుల్లోనే 300 వికెట్లు తీశాడు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో రబాడ ఈ మైలురాయి అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో బంగ్లా బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ వికెట్‌తో రబాడ ఈ ఘనత సాధించాడు. ఈ క్రమంలో పాకిస్థాన్ పేసర్ వకార్ యూనిస్ (12,602 బంతుల్లో)ను అధిగమించాడు.

రబాడ ఇప్పటివరకు 65 మ్యాచ్‌ల్లో సౌతాఫ్రికాకు ప్రాతినిధ్యం వహించాడు. ఇందులో 302 వికెట్లు పడగొట్టాడు. అటు బ్యాటింగ్‌లో 932 పరుగులు చేశాడు.

అతితక్కువ బంతుల్లో 300వికెట్లు తీసిన బౌలర్లు
కగిసో రబడ (సౌతాఫ్రికా )–11817 బంతులు
వకార్ యూనిస్ (పాకిస్థాన్)–12602 బంతులు
డేల్ స్టెయిన్ (సౌతాఫ్రికా )– 12605 బంతులు
అలెన్ డొనాల్డ్ (సౌతాఫ్రికా )–13672 బంతులు

# గాయం నుంచి కోలుకున్నాను




**బలగం టీవీ, హైదరాబాద్**

తాను మోకాలి గాయం నుంచి కోలుకున్నానని టీమ్ఇండియా పేసర్ మహ్మద్ షమీ స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియాలో జరిగనున్న బోర్డర్– గావస్కర్ ట్రోఫీలో పునరాగమనమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించాడు. త్వరలోనే బంగాల్ తరఫున రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడతానని తెలిపాడు. ప్రస్తుతం తాను 100 శాతం ఫిట్‌నెస్‌తో ఉన్నానని చెప్పుకొచ్చాడు. రీసెంట్‌గా ఓ కార్యక్రమంలో పాల్గొన్న షమీ మాట్లాడుతూ ‘ప్రస్తుతం నేను గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాను. ఆస్ట్రేలియాతో సిరీస్‌తో టీమ్ఇండియాలో రీ ఎంట్రీ ఇవ్వడమే నా లక్ష్యం. నిన్న బౌలింగ్ చేసినందుకు సంతోషంగా ఉంది. అంతకుముందు గాయం తిరగబెడుతుందనే భయంతో హాఫ్ రన్నింగ్‌తోనే బౌలింగ్ చేశా. కానీ నిన్న బౌలింగ్ చేసినప్పుడు ఏం ఇబ్బంది కలగలేదు. 100శాతం ఫిట్‌నెస్‌తో బౌలింగ్ చేశా. ఫలితంగా బాగుంది. గాయం నొప్పి పెట్టలేదు. ఆస్ట్రేలియా సిరీస్‌కు నేను రీఎంట్రీ ఇస్తానా అని చాలా మంది ఆలోచిస్తున్నారు. అది తేలడానికి ఇంకా కొంత సమయం ఉంది’ అని షమీ తెలిపాడు.

# క్రికెటర్లకు యోయో టెస్టు వద్దు



● **సునీల్ గవాస్కర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

సర్ఫరాజ్‌ను చూసైనా క్రికెటర్లకు ఆ పరీక్ష ఆపేయాలని మాజీ క్రికెటర్ గవాస్కర్ డిమాండ్ చేశారు. న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్ సిరీస్ తర్వాత యువ ఆటగాడు సర్ఫరాజ్ పేరు మార్మోగిపోతోన్న సంగతి తెలిసిందే. తాజాగా మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సర్ఫరాజ్ పై ప్రశంసలు కురిపించాడు. అదే సమయంలో యోయో టెస్టు పేరుతో ఆటగాళ్ల ఫిట్నెస్ ను మాత్రమే కొలుస్తూ ప్రతిభను పక్కనపెడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

దేశవాలీ క్రికెట్ లో పరుగుల వరద పారిస్తున్న సర్ఫరాజ్ కు అవకాశాలు రాకపోవడానికి కారణం కూడా ఈ ఫిట్నెస్ టెస్టులేనని అన్నాడు. అంతర్జాతీయ క్రికెట్ కు ఎంపిక చేసేందుకు సర్ఫరాజ్ నడుము సన్నగా లేదని ఫిట్నెస్ లేదని రిజెక్ట్ చేశారన్నారు. ఇప్పుడు అతడి నడుము సైజు కన్నా గొప్ప క్రికెట్ ఆడాడు అని మెచ్చుకున్నారు. భారత క్రికెట్‌లో నిర్ణయాధికారాలు ఎక్కువగా ఉండటం బాధాకరమన్నారు.

రిషభ్ పంత్ ను సైతం ఇదే కారణంతో పక్కన పెట్టారన్నాడు. ’పంత్ రోజంతా వికెట్ కీపింగ్ చేస్తున్నాడు. 6 గంటలకుపైగా ఆట కోసం వంగిలేస్తున్నాడు. త్రోలను అందుకోవడం కోసం స్టంప్స్ దగ్గరకు పరిగెత్తుతున్నాడు’ అని తెలిపాడు. ఇప్పటికైనా ఆటగాళ్ల శరీరాకృతి మాత్రమే కాకుండా వారు మానసికంగా ఎంత సన్నద్ధంగా ఉన్నారనే విషయంపై ఎక్కువ ఫోకస్ పెట్టాలని సూచించాడు.

ఇకనైనా క్రికెటర్లకు యోయో టెస్టులు నిర్వహించకండి అని గవాస్కర్ భారత క్రికెట్ నియంత్రణ మండలికి విన్నవించాడు. యో యో టెస్టుల పేరుతో ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను అంచనా వేయకండి. ఈ పరీక్షలకు బదులు వాళ్లు మానసికంగా ఎంత బలంగా ఉన్నారో తెలుసుకోండి అని గవాస్కర్ తెలిపాడు.